క్లుప్తంగా

ఎస్సీమర్రిగూడెంలో చోరీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎస్సీమర్రిగూడెం గ్రామంలో రాదారపు మోహన్ అనే వ్యక్తి ఇంట్లో పట్టపగలు దొంగతనం జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాదారపు మోహన్ మంగళవారం ఉదయం మిర్చి తోటల్లో పనులకు వెళ్లినట్లు తెలిపారు. పనులు ముగించుకోని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న బీరువా తాలాలను పగుల గొట్టి రూ.20 వేల నగదు, వెండి వస్తువులను అపహరించుకు పోయినట్లు తెలిపారు. కాగా ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో పట్ట పగలు దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు.

వినతిపత్రం అందజేత



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కె పురం పంచాయతీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం సర్పంచ్ పూనెం శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. 2వ వార్డులో సైడ్‌కాల్వలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గుంతలమయంగా మారిన రోడ్లను మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మంగపేట: మండలంలో వేసవి కాలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మండల స్పెషలాఫీసర్ తుల రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజుపేట, బ్రాహ్మణపల్లి, చెరుపల్లి, కొత్తమల్లూరు, రామచంద్రునిపేట, రమణక్కపేట, వాడగూడెం గ్రామాలలో తాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల్లో బోరు బావి నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో చర్చించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర రీసెర్చ్ అండ్ పాలసీ ఇన్‌చార్జ్ రాజునాయక్ మంగళవారం పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎం శారద మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. దరాఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆడబిడ్డలకు 'కల్యాణలక్ష్మి' వరం



ఎస్ఎస్ తాడ్వాయి: చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ జగదీశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమని అన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌ఖాన్, ఎంపీటీసీ కుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి లాకావత్ రాణాప్రతాప్ స్వామి వారికి పాలాభిషేకం చేశారు. ఆలయ పరిసరాలలో సహజసిద్ధంగా ఏర్పడిన జలదారను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తిపల్లి, పాట్లాపూర్, జగ్గన్నపేట, చిన్న గుంటూర్‌పల్లి, కొడిశల కుంట పరిధిలోని గొలుసుకట్టు చెరువులకు రామప్ప నుంచి రంగయ్యచెరువుకు వెళ్తున్న పైప్‌లైన్ ద్వారా నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఆదిరెడ్డి, మురళి, సాంబయ్య, జగన్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంగపేట: పూజలు నిర్వహిస్తున్న జగదీశ్

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మంగపేట: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు



వాజేడు: పెద్దగొల్లగూడెంలో..

మంగపేట: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మండల స్పెషలాఫీసర్ తుల రవి అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, రమణక్కపేట, రాజుపేట గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయా శిబిరాల్లో ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా, రోజు వారిగా ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. బోరునర్సాపురం, రమణక్కపేట గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కమలాపురం నుంచి జిల్లా సరిహద్దు గ్రామం బ్రాహ్మణపల్లి వరకు ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు నీళ్లు పడుతున్న పనలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదుర్శులు మురళి, యాదవరాజ్ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

వాజేడు: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్ మంగళవారం పరిశీలించారు. కంటి పరిక్షల కోసం వచ్చే వారికి అన్ని వసతులు ఉన్నది లేనిది చూశారు. అనంతరం గ్రామంలోని హెల్త్‌సబ్ సెంటర్‌ను పరిశీలించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఖాజాపాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4 వార్డులో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఆర్ఈజీఎస్ కింద రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో మట్టిరోడ్లు అన్ని కూడా సీసీ రోడ్లు అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండెపల్లి నర్సయ్య, కందగట్ల శ్రీనివాస్, వావిలాల ముత్తయ్య, కాళ్ల రామకృష్ణ, సైలనిబాబా, సాగర్, యాకూబ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్టీ హాస్టల్ వెనుకాల రోడ్డును నాల్గొవ వార్డు సభ్యురాలు మల్లమ్మ ప్రారంభించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



వెంకటాపురం(ఎం): అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



ఎస్ఎస్ తాడ్వాయిలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని నయం చేసేందుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత మందులు పంపిణీ చేస్తామన్నారు. క్షయ వ్యాధి సోకిన వారు పరీక్షలు చేయించుకోని వైద్యుల సూచించిన విధంగా మందులు వేసుకోవాలన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ ఖలీల్, హెచ్‌వీ లక్ష్మీ, ల్యాబ్ టెక్నీషియన్ రజిత, స్టాఫ్ నర్సు నిర్మల, ఏఎన్ఎం మంగ పాల్గొన్నారు.

టీబీ రహిత మండలంగా మార్చాలి

వెంకటాపురం (ఎం): మండలాన్ని టీబీ రహిత మండలంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వెంకటాపురం (ఎం) పల్లె దవఖాన డాక్టర్ అనిత అన్నారు. మంగళవారం జాతీయ టీబీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ నియంత్రణకు ఆధునాతన పద్ధతిలో వైద్యం అందించి నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మూడు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆశ కార్యకర్తను సంప్రదించాలని అన్నారు. తెమడను తీసుకొని వెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తారని సూచించారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మహబూబ్ పాషా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, స్టాఫ్ నర్సు సంధ్య, ఫార్మసిస్ట్ రాజమణి, ఎల్‌టి కృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

మంగపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు(బుధవారం) నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం 128 మంది, సెకండీయర్ విద్యార్థులు 138 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. తరగతి గదుల్లో ప్రశాంతంగా పరీక్షలు రాసేవిదంగా టేబుల్స్, తాగునీరు. లైటింగ్ , ఫ్యాన్లు తదితర సౌకర్యాలు సర్వం సిద్ధం చేశామన్నారు. ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయం 08 గంటలకే కళాశాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

ఇంటర్ పరీక్షలకు సిద్ధం

వాజేడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు సిబ్బంది అంతా సిద్ధం చేశారు. మొదటి సంవత్సరంలో 155 మంది, ద్వితీయ సంవత్సరంలో 157 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కాగా కళాశాలలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, సిబ్బందికి సూచనలు చేసినట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మిషన్ అంత్యోదయ గ్రామ సభ నిర్వహించి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న అన్నిశాఖల పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. గ్రామ స్థాయిలో సర్వే చేపట్టి వచ్చే ఏడాది జనవరి వరకు పూర్తి చేయాల్సి ఉందన్నారు. సర్వేలో మొదటా గ్రామ స్వరూపం, జనాభా ఎంత, ఎస్సీ, ఎస్టీలు, తదితర వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. నీటి వనరులు ఇతరత్ర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. ఇందు కోసం శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు నాగమణి, స్వప్న, కోఆప్షన్ సభ్యురాలుతిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావొద్దు



మాట్లాడుతున్న దామోదర్

ములుగు రూరల్(గోవిందరావుపేట): విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్ సూచించారు. మంగళవారం గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పలితాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు దయసాగర్, అశోక్, నర్సయ్య, సత్యనారాయణ, మల్లయ్య, రాములు, లక్ష్మయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ములుగు రూరల్: మండలంలోని పొట్లాపూర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ కుమ్మిత లలిత అంకిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన మిషన్ భగీరథ డీఈ సంధ్యారాణి, ఏఈ నర్సయ్యలను అడ్డుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలుమార్లు ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కలెక్టర్ గ్రామంలో మంచి నీటి సమస్యపై దరఖాస్తులు చేసుకోగా మంచినీటి బావి తవ్వకానికి అనుమతులు ఇచ్చి రద్దు చేశారని అన్నారు. గ్రామంలో అదనపు ట్యాంక్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని అన్నారు. కాగా, గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



షీల్డ్ అందిస్తున్న సునీల్‌రెడ్డి

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ గ్రామంలో ఏనక శ్రీనివాస్ స్మారకార్థం ఆదివాసీ గిరిజన సంఘం, అనసూయమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి నగదు, బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.10వేలతోపాటు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందడమే కాకుండా శారీరదృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి పూర్ణ చందర్, నాయకులు సందీప్, రమేష్, సర్వేష్, శ్రీనివాస్, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

వెంకటాపురం(కె): మండలంలో నూతనంగా ఏర్పాటైన కొత్త పంచాయతీల భవన నిర్మాణాల కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ అంటి నాగరాజుకు జెడ్పీటీసీ పాయం రమణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు భవనాలు లేక పంచాయతీ సిబ్బంది, అధికారులు, సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

'బిల్లు'కు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహదేవపూర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. దేశంలో ఇష్టమొచ్చినట్లుగా ఎన్నో బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకుంటున్న బీజేపీ ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 04న హైదరాబాద్‌ను వేలాది మందితో దిగ్బంధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని రవితేజ, రాజయ్య, లింగాల ప్రభుకుమార్, భిక్షపతి, రాము సుమన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



పస్రా పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు



ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యం అన్నారు. టీఎస్‌పీఎస్ ప్రశ్నపత్రాల లికేజీ విషయంపై జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది తెలంగాణ నిరుద్యోగుల జీవితాలతో ముడిపడి ఉన్న ఉద్యోగాలకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీక్ కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీఎస్‌పీఎస్‌లో పనిచేసే వ్యక్తి ప్రవీణ్ పేపర్ లీక్ చేయడం బాధాకరం అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కావేరి అర్జున్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈక మహాలక్ష్మి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం సత్యం, మండల ప్రధాన కార్యదర్శి సోదరి సమ్మయ్య, యువ మోర్చా మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి, మహిళా మోర్చా మండల అధ్యక్షులు పలక గంగ, గిరిజన మోర్చా అధ్యక్షుడు కొప్పుల నవీన్, ఓబీసీ మండల అధ్యక్షుడు చిటమట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకేజీ నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలునిచ్చిన నేపథ్యంలో మంగళవారం పార్టీ కార్యకర్తలను పస్రా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రశ్న పత్రాలను పరిరక్షించడంలో విఫలమైందన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీలో ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవిందర్, బద్దం జనార్ధన్, సురేష్, రమేష్, మహిపాల్‌రెడ్డి, కిరణ్, మనోహార్ , కిషోర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మొగుళ్లపల్లి: మండలంలోని మేదరమెట్ల, అంకుషాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఎపీడీ మంజులదేవి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో పెట్టిన కొలతల ప్రకారం కనీసం పని చేస్తే రూ.257 చొప్పున డబ్బులు పడుతాయన్నారు. ప్రతీ గ్రామంలో 60 మంది కూలీలకు పని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నర్సరీలలో 100 శాతం మొక్కలు బ్రతికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ కృష్ణవేణి ఏపీఓ కుమారస్వామి టెక్నికల్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.